క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు


కాలువల్లో పూడిక తీస్తున్న దృశ్యం

గొలుగొండ : గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ కసిపల్లి అప్పారావు (బుజ్జి), పంచాయతీ కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో బుధవారం కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే తాగునీటి పథకాలు, కుళాయిలు, చేతి బోర్ల వద్ద కూడా ఈ పనులు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండగ



కె.కోటపాడు : గుల్లేపల్లి గ్రామస్తుల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి పెద్ద పండగను గురువారం నిర్వహించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి అమ్మవారి పెద్ద పండగ నిర్వహించడం ఆనవాయితీ. పండగ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామంలో గల ప్రధాన వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ కశిరెడ్డి దేముడుబాబు తెలిపారు.

రూ. 8.10 కోట్ల పింఛన్ల నగదు విడుదల

మాడుగుల రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 1వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని స్థానిక ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 23 గ్రామ సచివాలయాలకు సంబంధించి 11,918 మంది పింఛనుదారులకు గాను, రూ. 8 కోట్ల 10 లక్షల 68 వేల 500 నగదు విడుదల అయిందని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు.. పెన్నుల అందజేత


దాత రాజేంద్రప్రసాద్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రోలుగుంట : జగ్గంపేట ఎంపీపీ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు కొత్తకోట హైస్కూల్ ఉపాధ్యాయుడు సొంత నిధులతో సమకూర్చిన రూ. 4 వేల విలువ గల పుస్తకాలు, ప్లాంక్‌లను బుధవారం ఉచితంగా అందజేశారు. పంపిణీ చేసిన వాటిలో పుస్తకాలతో పాటు, ఎగ్జామ్ ప్లాంక్, రెండేసి పెన్నులు, రెండేసి పెన్సిళ్లు, అరైజర్ పౌచ్ ఉన్నాయి. ఈ సందర్భంగా దాతకు పాఠశాల హెచ్ఎం సతీష్, ఉపాధ్యాయులు భారతి, ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే రాజుకు సత్కారం


ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజును సత్కరిస్తున్న మండల నాయకులు

రోలుగుంట : చోడవరం టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజుని ఆ పార్టీ మండల నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుములూరి చంద్రమౌళి, శరభవరం సర్పంచ్ పంచాడ చంద్ర, కొండపాలెం ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.కృష్ణ, పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు కొయిలాడ ఈశ్వరరావు, ఉలబాల పోతురాజు నాయుడు, నాయకులు రాంబాబు, బోశం రమేష్‌దొర తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గమే శ్రీరామరక్ష

మాదక ద్రవ్యాలు జీవితాలను **చిత్తు** చేస్తాయని పలు కళాశాలల **విద్యార్థు**లకు పోలీసులు అవగాహన **కల్పిం**చారు. విద్యార్థులు చక్కగా **చదివి** సన్మార్గంలో నడవాలని హిత**వు** పలికారు. యువత మత్తు ప**దార్థాల** జోలికి పోరాదని.. చదువుపై **దృష్టి** సారించి కన్నవారికి.. ఉన్న **ఊరికి పేరు** తేవాలని స్పష్టం చేశారు.

- మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన
- చదువుపై దృష్టి సారించి.. మంచి మార్గంలో నడవాలని హితవు


కె.కోటపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

నర్సీపట్నం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టౌన్ సీఐ కాంతికుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని టౌన్ పోలీసులు విద్యార్థులతో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అబిడ్స్ సెంటర్ నుండి ఆర్డీవో కార్యాలయం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌కు ర్యాలీ చేరుకోగానే విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశ మేరకు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. ఈ ర్యాలీలో ఎస్ఐలు సుధాకర్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి..

కె.కోటపాడు : యువత మంచి అలవాట్లతో సన్మార్గంలో నడవాలని కె.కోటపాడు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ అన్నారు. అయ్యన్న కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసులు, జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, సెట్విస్ మేనేజర్ వెంకటేష్, సూపరింటెండెంట్ సన్యాసిరావు, ఎన్ఎస్ఎస్ పీవో గాడి అప్పారావు, సీముసురు రమణ పాల్గొన్నారు.


దేవరాపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్యారాణి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి..

గొలుగొండ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర, గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ రహీమ్ తెలిపారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ చిన్నతనం నుంచి చదువుపై దృష్టి సారించి చక్కటి నడవడిక అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కావాలి..

దేవరాపల్లి : మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దేవరాపల్లి-1 సచివాలయ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం. సంధ్యారాణి అన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి-1, స్థానిక హెచ్ఎం బి. పడాల్‌దాస్ సమక్షంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే తక్షణమే పోలీస్‌లకు సమాచారం అందించాలని ఆమె విద్యార్థులకు సూచించారు.

పాఠశాలలు, కళాశాలల్లో..

రోలుగుంట : మండలంలో గల జూనియర్ కళాశాలతో పాటు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎం.లక్ష్మీదేవి, సౌజన్య, వరలక్ష్మి మత్తు పదార్థాల వల్ల కలిగే ముప్పును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాలు స్థానిక జూనియర్ కళాశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, కొమరవోలు, బుచ్చింపేట, కుసుర్లపూడి తదితర పాఠశాలల్లో నిర్వహించారు.

మత్తుకు చిక్కితే చిత్తే..

చోడవరం రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి పోరాదన్నారు. సీఐ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సరఫరా చేసే వారి పట్ల విద్యార్థులు జాగ్రత్త పడాలన్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కిరణ్‌మణీశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు ఆకర్షితులు కారాదన్నారు. ఎస్ఐ సూర్యనారాయణ, ఎక్సైజ్ ఎస్ఐ అప్పారావు, ఏఎస్ఐ శ్యామలకుమారి, ఎఫ్ఎస్ఎస్ పీవోలు వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు ఎస్ఎం రఫీయుద్దీన్, హెచ్. సుధీర్, ఐవీవీ సత్యవతి, సూర్యావతి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో..

రోలుగుంట: మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిలో మానవత్వం నశిస్తుందని, నేర ప్రవృత్తి సైతం చోటు చేసుకుంటుందని చోడవరం సబ్ జడ్జి రాజేంద్రబాబు హెచ్చరించారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సబ్ జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు కల్పించారు. న్యాయ సహాయ ప్లీడర్ భూపతిరాజు, సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వీరయ్య పాల్గొన్నారు.


రోలుగుంట సబ్ జైలులో మాట్లాడుతున్న సబ్ జడ్జి రాజేంద్రబాబు


అయ్యన్న కళాశాల విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందిస్తున్న అతిథులు

పోలీసులు, విద్యార్థుల ర్యాలీ..

మాకవరపాలెం : మండల కేంద్రంలో పోలీసులు, అధికారులు విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ హరి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో చంద్రరావు, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి సహకరించాలి..

మాడుగుల రూరల్ : బుధవారం సాయంత్రం పోలీసులు, జూనియర్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ స్వామినాయుడు మాట్లాడుతు మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి గ్రామ పుర వీధుల్లో ర్యాలీగా తరలి వెళ్లారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. స్థానిక ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు, అదనపు ఎస్ఐ వి. శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ కాంతికుమార్, సిబ్బంది


డ్రగ్స్ వ్యతిరేకంగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల మానవహారం


ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు

వర్షంతో చల్లబడిన వాతావరణం


వర్షం కురిసి వరి నారుమడుల్లో చేరిన నీరు

మాడుగుల రూరల్ : ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బుధవారం సాయంత్రం కురిసింది. సుమారు గంట సేపు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ వర్షానికి వరి నారుమడుల్లో నీరు చేరింది. ఈ వర్షం చెరకు తోటలకు లాభదాయకమని రైతులు పేర్కొన్నారు.

వైద్య సలహాలు పాటించాలి


కంతారంలో శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది సూచనలు, సలహాలు ప్రజలు తప్పకుండా పాటించాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. మండలంలో బుధవారం కంతారం, బుద్దడపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వ్యాధులతో ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే జోగుంపేట గ్రామంలో వైద్య, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంక్‌లు శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రసాద్, పీకే నాయుడితో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కె.కోటపాడు : వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పట్నాయక్ అన్నారు. బుధవారం వైద్య సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు 1,2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ మాట్లాడుతు పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థులకు వేడిగా భోజనం అందించాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ అల్లు శ్వేత మాట్లాడుతు మంచినీటి పథకాలను పంచాయతీలు నిర్ణీత కాలంలో శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిదీ

నాతవరం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని నాతవరం ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద బుధవారం మండల స్థాయిలో నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే చేసి బడి ఈడు పిల్లలుంటే వెంటనే పాఠశాలల్లో చేర్పించాలన్నారు. స్థానికంగా ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్పీలు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తే ఆశయం నెరవేరుతుందన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, గోవిందు, సత్యవేణి, వెంకటలక్ష్మి, ఎంఆర్‌సీ సిబ్బంది నాయుడు, సాంబ, శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో-2 వరహాలబాబు తదితరులు

మురుగు నీరు తొలగించుకోవాలి

కె.కోటపాడు : మురుగు నీటి నిల్వలను వారానికి ఒకసారి తొలగించుకునే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు అన్నారు. మలేరియా నిర్మూలన మాసోత్సవంలో భాగంగా బుధవారం వైద్య సిబ్బంది, సర్పంచ్ బండారు దేముళ్లు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతు ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, రుబ్బురోళ్లు, బోర్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షా కాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది కనుక ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు దోమ కాటు కారణంగానే వస్తాయని పేర్కొన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ దేముళ్లు, హెచ్ఏ రాజు

రోడ్ల నాణ్యత పరిశీలన

నర్సీపట్నం : మున్సిపాలిటీలో ఇటీవల నిర్మించిన రోడ్ల నాణ్యతను విజయవాడకు చెందిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు బుధవారం పరిశీలించారు. అబిడ్ సెంటర్ మెయిన్, కొత్తక వీధి ప్రత్యామ్నాయ రోడ్డు తదితర ప్రాంతాల్లో వేసిన రోడ్లను పరిశీలించి, శాంపిల్స్ సేకరించారు.

ఆరిలోవ అటవీ ప్రాంతంలో..

గొలుగొండ: ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఇటీవల నిర్మించిన రోడ్డు పనులను గుంటూరు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ భాస్కర్రావు జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు సక్రమంగా జరగలేదని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి ఫిర్యాదు మేరకు అధికారులు ఈ పరిశీలనలు జరిపారు. వారం రోజుల్లో మరోసారి పరిశీలన చేసి, తుది నివేదిక అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.


ఆరిలోవ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రైతులకు విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందజేస్తున్న నాయకులు

మాకవరపాలెం : మండలంలో తామరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు బుధవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, సర్పంచ్ చెల్లారత్నం, టీడీపీ నాయకులు శ్రీను, జనసేన నాయకులు సురేష్ రైతులకు విత్తనాలు అందజేశారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణం సాగు సాయం అందించాలి


మర్రివలస రైతులతో సంఘం నాయకులు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయాన్ని ఈ ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు అందించాలని రైతన్న కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సప్పా శ్రీనివాస్ అన్నారు. మర్రివలసలో బుధవారం పర్యటించిన ఆయన రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సాగు కాలం ప్రారంభం అయినా ఇంకా విత్తనాల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తానన్న రూ. 20 వేల సాగు సాయాన్ని వెంటనే అందించి పెట్టుబడికి రైతులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఇల్లాకు రాము, ఈర్లె అప్పారావు, సియ్యాద్రి రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణారావు తెలిపారు. ఏరియా ఆస్పత్రి, పోలీసు స్టేషన్, బొంతువీధి, గచ్చపువీధి ప్రాంతాల్లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంటి శస్త్ర చికిత్సకు 38 మంది ఎంపిక

చోడవరం రూరల్ : లయన్స్ క్లబ్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా స్థానిక ఐ డ్రీం నేత్రాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 38 మంది కంటి రోగులను శస్త్ర చికత్సలకు ఎంపిక చేశారు. ఉదయం 10 గంటలకు శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి సాంబశివరావు ప్రారంభించారు. చోడవరం మండలంలో పలు గ్రామాల నుంచి 60 మంది పైబడిన రోగులకు చోడవరం సీహెచ్‌సీ ఆప్తాల్మజిస్ట్ మక్కా రమేష్, శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు రోగులకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వేపాడ సత్యనారాయణ, డాక్టర్ శకుంతల, గనిరెడ్డి, వజ్జుల రమేష్, ఎస్ఎస్ మాల్ శ్రీను, పూసర్ల రామారావు పాల్గొన్నారు.


శిబిరానికి వచ్చిన కంటి రోగులు

నూతన కార్యవర్గం ఎంపిక

నాతవరం : మండలంలోని మర్రిపాలెంలో గల విశాఖ డెయిరీ పాల కేంద్రం అధ్యక్షుడిగా నందిపల్లి వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గం ఏర్పాటుకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. డైరెక్టర్లుగా గొంప దారబాబు, రంభా రాంబాబు, బొత్సా నాయుడు, పప్పల అప్పలనాయుడు, బొత్సా అప్పలనాయుడు, పోతల రమణమ్మ, ఓబ్బలరెడ్డి అప్పలనాయుడు, బంగారు సత్తిబాబు, పోతల అప్పలనాయుడు, అచ్చెర్ల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు, డైరెక్టర్లచే పాల కేంద్రం కార్యదర్శులు నందిపల్లి తాతయ్యలు, రెడ్డి రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ మర్రిపాలెం పాలకేంద్రాన్ని నర్సీపట్నం డివిజన్‌లో 1982లో ఏర్పాటు చేశారన్నారు. దీనికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సహాయ సహకారాలతో పాలకేంద్రం అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు.


పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎస్ఐ రామారావు, సత్యనారాయణ, మాణిక్యం

ఉపాధి పనుల లక్ష్యం పూర్తి చేయాలి

కోటవురట్ల : మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌ను పూర్తి చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగునాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్

మునగపాక : రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని వాడ్రాపల్లిలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో బుధవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల వినియోగం అలాగే ఎరువుల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడ్రాపల్లిలో చౌడు భూములున్నట్లు గుర్తించామన్నారు. ఫౌండేషన్ ద్వారా ఉచితంగా భూసార పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.